సాక్షి నిజామాబాద్

బుధవారం । 23 । ఆగస్టు । 2023



వర్నికి మహిళా డిగ్రీ కళాశాల

వర్నికి మహిళా డిగ్రీ కళాశాల మంజూరైంద ని. వచ్చే ఏడాది నుంచి క్లాసులు ప్రారంభం కానున్నాయని స్పీకర్ పోచారం తెలిపారు.

- 10లో ▸



పల్లెల్లో గంజాయి జోరు

పల్లెల్లో యువకులు గంజాయి ఉచ్చులో చిక్కుకుంటున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.2 /24.5

ఉదయం నుంచి ఎండతీవ్రత ఉంటుంది. ఉక్కపోతగా ఉండవచ్చు. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

బీజేపీలో నియామకాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు లోక్‌సభ స్థానాలకు కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్‌గా గద్దె శ్రీనివాస్ (భూమన్న) (నిజామాబాద్)ను, జాయింట్ కన్వీనర్‌గా గుంటుక సదాశివ్ (జగిత్యాల) నియమితులయ్యారు.

మంచిపనులు చేస్తే కీర్తించాలి

• మంత్రి ప్రశాంత్‌రెడ్డి



నిజామాబాద్‌నాగారం : సమాజంలో ఎవరైనా సరే మంచి పనులు చేసిన ప్రతి ఒక్కరిని సేవలను ఖచ్చితంగా కీర్తించాల్సిందేనని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో రాజా బహదూర్ కోత్వాల్ వెంకట్ రాం రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యాప్తికి కృషిచేసి ఆర్‌బీవీఆర్‌ఆర్ పేరు తో రాష్ట్ర వ్యాప్తంగా విద్య సంస్థలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్ బిగాల మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ఈగ సంజీవ్ రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఉమా తదితరులున్నారు.

చెస్ టోర్నీలో బ్రహ్మానందం ప్రతిభ



నిజామాబాద్‌నాగారం : ఈ నెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ చెస్ టోర్నీలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు బ్రహ్మానందం మొదటి స్థానం సాధించారు. కంఠంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా బ్రహ్మానందం విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు రమేశ్, కార్యదర్శి ఎ రమేశ్ ప్రత్యేకంగా సత్కరించారు.

ప్రతి గ్రామంలో వెయ్యి మొక్కలు నాటాలి



డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26న అన్ని గ్రామపంచాయతీల్లో హరిత హారం కింద 1000 మొక్కలు నాటాలని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించడం అందరి బాధ్యత అన్నారు. గ్రామ నర్సరీల నిర్వహణ, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు, గ్రేడింగ్, సోషల్ ఆడిట్ తదితర అంశాల వారిగా ఆన్‌లైన్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 సక్సెస్ కావాలని పూజలు



ధర్పల్లి: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ మండల కేంద్రంలోని లిటిల్ హార్ట్స్ విద్యార్థులు పాఠశాల ఆవరణలోని గణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పంచాయతీలకు

నిధుల దిక్కేది!

• 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల
• గత ఆర్థిక సంవత్సరం నిధుల కేటాయింపులే పూర్తి కాని వైనం
• ఆర్థిక కష్టాల్లో ఉన్న జీపీలకు చేయూతనివ్వని కేంద్రం
• అష్టకష్టాలు పడుతున్న సర్పంచ్‌లు

గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో నిధులివ్వకపోవడంతో సర్పంచ్‌లు ఇబ్బందులకు గురవుతున్నారు. జీపీల్లో ఎలాంటి పనులు చేయించలేక, సిబ్బందికి జీతాలివ్వలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రభుత్వాలు స్పందించాలని వేడుకుంటున్నారు.

మోర్తాడ్(బాల్కొండ): గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం ద్వారా నిధుల కేటాయింపుల విషయంలో కేంద్రం అలసత్వం ప్రదర్శించడంపై సర్పంచ్‌లు పెదవి విరుస్తున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధుల కేటాయింపు ఇంకా పూర్తి కాకపోవడంతో ఇప్పటి ఆర్థిక సంవత్సరం నిధుల విడుదలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న పంచాయతీలకు ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ గ్రాంటును మంజూరు చేయకపోవడం, అటు కేంద్రం 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు ఇవ్వకపోవడం ఇబ్బందిగా మారింది. రెండు రోజుల కింద 15వ ఆర్థిక సంఘంకు సంబంధించిన రెండో విడత నిధులు జిల్లాలోని అన్ని పంచాయతీలకు జమ చేశారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలకుగాను జనరల్ ఫండ్‌గా రూ.14,02,21,159ని విడుదల చేయగా, ఎస్సీ ప్రత్యేక గ్రాంటుగా రూ.2,49,08,481 నిధులను, ఎస్టీ గ్రాంటుగా రూ.1,15,16,179 నిధులను కేటాయించారు. వాస్తవానికి ఆర్థిక సంఘం ద్వారా సంవత్సరానికి రూ.150 కోట్లకు మించి నిధులు విడుదల కావాల్సి ఉంది. అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ ద్వారా గ్రాంటును మంజూరు చేయాలి.

కొత్త ఖాతాలు తెరిచినా..

గతంలో కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన వద్ద ఉంచుకుని ప్రతి నెలా పంచాయతీలకు నిధులను విడుదల చేసేది. తాము ఇచ్చే నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పెత్తనం చెలాయిస్తుందనే ఉద్దేశ్యంతో ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులో కేంద్రం విధి విధానాలను మార్చింది. కేంద్రం నేరుగా పంచాయతీల ఖాతాలకు నిధులను జమ చేయడానికి ప్రత్యేక ఖాతాలను తెరిపించింది. గతేడాదే ఖాతాలను తెరిచినా గ్రాంటు విడుదలలో మాత్రం జాప్యం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదలై ఐదు నెలలు గడిచినా నయాపైసా నిధులు జమ చేయలేదు. గతేడాది సంబంధించిన నిధుల కేటాయింపులు పూర్తికాకపోవడంతో ఈసారి నిధుల విడుదలలో ఆలస్యం జరుగుతుందని తెలుస్తుంది. గ్రామ పంచాయతీ లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంటులపై ఆధారపడి ఉన్నా రెండు ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తుండటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

రెగ్యులర్‌గా అందజేయాలి



గ్రామ పంచాయతీలకు కేంద్రం ఆర్థిక సంఘం ద్వారా నిధులను రెగ్యులర్‌గా ఇవ్వాలి. నిధుల కేటాయింపులో జాప్యం వల్ల పంచాయతీల్లో పనులు సాగడం లేదు. కేంద్రం స్పందించి పంచాయతీల పరిస్థితిని అర్థం చేసుకోవాలి.
– భోగ ధరణి, సర్పంచ్, మోర్తాడ్

నిర్లక్ష్యం తగదు



పంచాయతీలపై కేంద్రానికి నిర్లక్ష్యం తగదు. పంచాయతీలకు ప్రత్యేక ఆదాయం లేకపోవడంతో కేంద్రం ఇచ్చే నిధుల కోసం వేచి చూడాల్సి వస్తుంది. ప్రభుత్వ స్పందించి నిధులు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలి.
– గడ్డం చిన్నారెడ్డి, సర్పంచ్, తిమ్మాపూర్

సారూ.. మా గోడు పట్టించుకోరూ?

• శ్రీరాంసాగర్ ముంపు గ్రామాల బాధిత కుటుంబాల వారసుల గగ్గోలు
• ప్రభుత్వం జీవో.. కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఉద్యోగాలు ఇవ్వడంలేదంటూ ఆవేదన
• ప్రభుత్వం అడిగినప్పటికీ కలెక్టర్లు పేర్లు పంపని పరిస్థితి



నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శ్రీరాంసాగర్ జలాశయం కింద భూములు కోల్పోయిన నిజామాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలోని కుటుంబాలకు సంబంధించి వారసులు ఇప్పటికీ న్యాయం కోసం తిరుగుతున్నారు. ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్న తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. 1986లో ఎస్సారెస్పీ నిర్వాసిత కుటుంబాల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ అప్పటి ప్రభుత్వం జీవో 98 విడుదల చేసింది. వీరికి వయస్సు పరిమితి సైతం లేదంటూ ప్రభుత్వం జీవో 266 కూడా ఇచ్చింది. ఇందుకు గాను ప్రభుత్వం కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్సారెస్పీ ఎస్ఈతో త్రిసభ్య కమి టీ వేసింది. సదరు జీవో మేరకు 24 కాలమ్ ప్రొ ఫార్మా ఉన్నవారు ఉద్యోగాలకు అర్హులుగా పేర్కొన్నారు. అదేవిధంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అప్రూవల్, కోర్టు జడ్జిమెంట్ సైతం ఉన్నాయి. అప్పట్లో ఈ కమిటీ నివేదిక అనుసరించి ఇచ్చిన జాబితాలో 50శాతం మందికి ఉద్యోగాలు ఇచ్చారు. మిగిలిన సగం మందికి ఉద్యోగాలు ఇచ్చే విషయంలో తరువాత వచ్చిన కలెక్టర్లు నిర్లక్ష్యం చేశారు. యోగితారాణా కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వానికి రాశారు. ఈ క్రమంలో 2016లో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 30 మంది కోర్టుకు వెళ్లారు. నిర్వాసితులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిర్వాసితులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం 2020 డిసెంబర్ 28న జీవో 45 విడుదల చేసింది. తాజాగా ఈ నెల 4వ తేదీన నిర్వాసితుల జాబితా పంపాలంటూ నీటిపారుదల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లకు లెటర్లు వచ్చాయి. ఇందులో నిజామాబాద్, నిర్మల్ జిల్లాల పేర్లు సైతం ఉన్నాయి. దీంతో ఈ నెల 7వ తేదీన నిర్వాసితులు నిజామాబాద్ నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అయితే కలెక్టర్ నుంచి మాత్రం తమ పేర్ల జాబితా పంపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని నిర్వాసిత కుటుంబాల వారసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చిత్రమిశ్రా

నిజామాబాద్ నాగారం : లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ చిత్రమిశ్రా పేర్కొన్నారు. మంగళవారం గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించే చట్టంలో భాగంగా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించారు. శిశువుకు స్కానింగ్‌ను ఆసరాగా చేసుకుని ఎవరైనా భ్రూణ హత్యలకు పాల్పడినా.. లింగ నిర్ధారణ చేసినా సంబంధిత స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లింగనిష్పత్తి తక్కువగా ఉన్న మండలాలను ఎంచుకుని అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కొత్తగా మూడు స్కానింగ్ సెంటర్స్ రిజిస్ట్రేషన్ కోసం, 10 స్కానింగ్ సెంటర్స్ రెన్యూవల్ కోసం మూడు స్కానింగ్ సెంటర్లను క్యాన్సల్ చేయడంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష రిపోర్టును త్వరలోనే కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం మాట్లాడుతూ ఎక్కడైనా అబార్షన్లు జరిగితే వాటిపై సమీక్ష చేయాలన్నారు. ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎప్పుడూ డెకాయ్ రేషన్ నిర్వహించిన పోలీసుల సహకారం ఉంటుందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలకు సహకరించే ఆర్‌ఎంపీలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి పద్మావతి, పీసీపీఎన్డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేష్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షులు విజయానంద్ గారు, సీడీపీవో సౌందర్య, డెమో గంగాధర్, ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, దేవేందర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

• ప్రతిఓటరు తప్పనిసరి ఓటింగ్‌లో పాల్గొనాలి
• కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
• పోలింగ్ ప్రక్రియ, సదుపాయాలపై వయోవృద్ధులకు అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఓటు హక్కు కలిగిఉన్న ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం వయోవృద్ధులకు పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తూ, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌ల పనితీరుపై అనుమానాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 80 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు తమ ఇంటి నుండే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును కల్పించిందన్నారు. ఇంటి నుంచి ఓటు వేయాలనుకునే వారు ఎన్నికల ప్రకటన వెలువడిన మీదట నిర్ణీత ఫారం నింపి తమ అభ్యర్థనను తెలియజేస్తే, పోలింగ్ అధికారి నేతృత్వంలోని సిబ్బంది వారి ఇంటి వద్దకు వచ్చి సీక్రెట్ బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తూ ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటారన్నారు. వయోవృద్ధుల కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రతిపోలింగ్ కేంద్రంలో ర్యాంప్, వీల్‌చెయిర్ వంటి సదుపాయాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. సీనియర్ సిటిజన్లు కూడా పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరందు, స్వీప్ నోడల్ అధికారి సింహాచలం, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, సీనియర్ సిటిజన్ ఫోరం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు భూమన్న, రవీందర్, రామ్మోహన్, బుస్స ఆంజనేయులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఓటమి భయం

• అందుకే రెండుచోట్ల నుంచి పోటీ
• బీజేపీకి మైనార్టీల ఓటు బ్యాంక్ పెరిగింది
• కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో మైనార్టీలకు లాభం జరగలేదు
• ఎంపీ అర్వింద్ ధర్మపురి



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, పక్కన బస్వా లక్ష్మీనర్సయ్య, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్) : సీఎం కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే కామారెడ్డి నుంచి కూడా పోటీ చేస్తున్నారని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి విమర్శించారు. మంగళవారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లారోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. గజ్వేల్, కామారెడ్డిలు అతి సమీపంలో ఉన్న నియోజకవర్గాలన్న విషయం కేసీఆర్‌కు తెలుసన్నారు. ఉత్తర తెలంగాణలో లేదా, ఆర్మూర్, ఆదిలాబాద్ నుంచి సీఎం పోటీ చేయాలన్నారు. కేసీఆర్ అభద్రతాభావంతో ఉన్నారని, అందుకే రెండు చోట్ల పోటీకి సిద్ధం అయ్యారని, రాబో యే ఎన్నికలలో ఆయన ఓడిపోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో మైనారిటీలకు ఒరిగిందేమీ లేదని, వారిని గుర్తించింది బీజేపీనేనన్నారు. పీఎం ఆవాస్ యోజన కింద దేశంలో 3.5 కోట్ల ఇళ్లిచ్చామని, ఇందులో 70 శాతం ముస్లిం మహిళలు లబ్ధి పొందారని తెలిపారు. బీజేపీ మైనారిటీలకు వ్యతిరేకం కాదని, దీనిని నిరూపించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. మైనార్టీలను గుర్తించింది కేవలం బీజేపీ అని అన్నారు. మైనార్టీల కోసం ఎంపీగా ఇక్కడికి వచ్చానన్నారు. మైనార్టీలకు బీఆర్ఎస్ డబుల్ బెడ్‌రూంలు ఇవ్వలేదన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయకపోవడంతో మైనారిటీలు నష్టపోతున్నారన్నారు. తెలంగాణలో మినహా ఇతర రాష్ట్రాల్లో ముస్లింలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. మునుగోడు పూర్తి స్థాయిలో దళితబంధు ఇవ్వలేదని, మైనారిటీ బంధు మాటలకే పరిమితమైందన్నారు. 2016 నుంచి ఎలాంటి పథకాలు ఇవ్వట్లేదని, వారిక ఉద్యోగాలూ కరువేనన్నారు. రాష్ట్రంలో ముగ్గురు ముస్లింలకే టికెట్లు ఇచ్చారన్నారు. బీజేపీకి ఓటు వద్దనుకుంటే నోటాకు వేయండన్నారు. బీజేపీకి ముస్లింల ఓట్లు పెరుగుతున్నాయన్నారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో మహిళలకు మేలన్నారు. బీఆర్ఎస్, ఎంఐఎం దోస్తీతో ముస్లింలకే నష్టమన్నారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కా దని, దీనిని నిరూపించేందుకు అవకాశమివ్వాలన్నా రు. పార్లమెంటు సమావేశాల్లో ఉన్నప్పుడు కావాలనే కేటీఆర్ నిజామాబాద్‌లో పర్యటించారన్నారు.

ఎంపీ ల్యాడ్ నిధులు కావాలని ఏ మైనారిటీ నాయకుడు నన్ను సంప్రదించలేదన్నారు. అయినప్పటికీ కేంద్రం ద్వారా మైనార్టీలకు నిధులు అందుతున్నాయన్నారు. ఇటీవల కేటీఆర్‌ని బుడబుక్కలోడు అని అన్నానని, ఆ కులసంఘంపై అవగాహన లేదని అందుకు చింతిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు ఎమ్మెల్యే మునిరాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వాల క్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ కార్పొరేటర్లు తదితరులున్నారు.



హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, షకీల్

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు



జిల్లాలో బీఆర్ఎస్ తరపున టిక్కెట్లు సాధించిన ఎమ్మెల్యేలు మంగళవారం సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, షకీల్ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎం కేసీఆర్ బాజిరెడ్డిని సన్మానించారు.

క్లుప్తంగా

మాల్టాలో పనిచేయడానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: మాల్టాలో (యూరప్‌ దేశం) నిర్మాణ రంగంలో పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి ఈ నెల 24న ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీనివాస్‌ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌ నగరంలోని శివాజీనగర్‌ ఐటీఐ క్యాంపస్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో డ్రైవ్‌ ఉంటుందని పేర్కొన్నారు. సివిల్‌ ఫోర్‌మెన్‌, షట్టరింగ్‌ కార్పెంటర్‌, కాంక్రీట్‌ మిషన్‌, స్టీల్‌ ఫిక్సర్‌, ప్యానెల్‌ బీటర్‌/స్ప్రేయర్‌లల్లో ఐదేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని వివరించారు. వారానికి 40 గంటల పని ఉంటుందన్నారు. జీతం గంటలకు 3.60 యూరోల నుంచి 7 యూరోల వరకు ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు భోజనం, వసతి, రవాణా సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు టామ్‌కామ్‌ వెబ్‌సైట్‌ లేదా మొబైల్‌ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7893566493, 8247838789, 8328602231 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్‌ సిటీ: పీఎఫ్‌ నిజామాబాద్‌ రీజినల్‌ కార్యాలయం కమిషనర్‌గా గణేశ్‌కుమార్‌ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ముంబయి పీఎఫ్‌ కార్యాలయంలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో కమిషనర్‌గా పనిచేసిన హనుమంతప్ప మార్చి 31 పదవి విరమణ చేయడంతో కమిషనర్‌ పోస్ట్‌ ఇప్పటి వరకు ఖాళీగా ఉంది.

కొనసాగుతున్న బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ సెమిస్టర్‌ రెగ్యులర్‌/బ్యాక్‌లాగ్‌ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన బీఈడీ 3వ సెమిస్టర్‌ పరీక్షలకు 45 మంది విద్యార్థులకు 39 మంది, మధ్యాహ్నం జరిగిన 2వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు 51 మంది విద్యార్థులకు 47 మంది హాజరైనట్లు తెలిపారు.

పదోన్నతులు కల్పించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో 2014లో నియామకమైన తమకు కెరీర్‌ అడ్వాన్స్‌మెంట్‌ స్కీమ్‌ (క్యాస్‌) ద్వారా పదోన్నతులు కల్పించాలని పలువురు అధ్యాపకులు మంగళవారం రిజిస్ట్రార్‌ ఎం యాదగిరిని కలిసి వినతి పత్రం అందజేశారు. అన్ని అర్హతలు కలిగి వర్సిటీ అభివృద్ధిలో భాగం పంచుకుంటున్న తమకు కొందరు ఉద్దేశపూర్వకంగా పదోన్నతులు నిలుపుదల చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రఖ్యాతి గాంచిన యూనివర్సిటీలలో పరిశోధన, బోధన అనుభవం కలిగి ఉన్నామని, గతంలో న్యాక్‌ అక్రిడేషన్‌లో కీలకభూమిక పోషించామన్నారు. ఇంక్రిమెంట్లతో పాటు వేతన సవరణ ద్వారా జీతభత్యాలు పొందుతున్నప్పటికీ పదోన్నతులు ఆపడం దురదృష్టకరమన్నారు. అన్ని విషయాలను సమగ్రంగా ఇన్‌చార్జీ వీసీ వాకాటి కరుణ, పాలక మండలి సభ్యులతో చర్చించి పదోన్నతి ప్రక్రియ చేపట్టాలని విన్నవించారు.

లక్ష్యం చేరుకునేనా!

- ఎస్సారెస్పీలో పూర్తిస్థాయిలో జరగని విద్యుత్‌ ఉత్పత్తి
- గరిష్టంగా ఒక్కరోజు 35.7 మెగావాట్ల తయారీ
- ఈ ఏడాది టార్గెట్‌ 60 మిలియన్‌ యూనిట్లు
- ఇప్పటి వరకు 15 మిలియన్‌ యూనిట్ల కరెంట్‌ ఉత్పత్తి



జల విద్యుత్‌ కేంద్రంలోని టర్బయిన్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టు దిగువన గల జల విద్యుత్‌ కేంద్రంలో పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరగడం లేదు. ప్రాజెక్ట్‌ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు గోదావరి పాలైన పూర్తి స్థాయిలో కరెంట్‌ ఉత్పత్తి చేయలేదు. కేంద్రంలో నాలుగు టర్బయిన్‌లు ఉన్నాయి. ఒక్కో టర్బయిన్‌ ద్వారా 9 మెగావాట్ల చొప్పున 4 టర్బయన్ల ద్వారా 36 మెగావాట్లు తయారు చేయవచ్చు. కానీ ప్రస్తుత సంవత్సరం ఒక్కరోజు కూడా పూర్థిస్థాయిలో ఉత్పత్తి జరగలేదు. గరిష్టంగా ఒకరోజు మాత్రమే 35.7 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగింది. ఒక్కో టర్బయిన్‌ ద్వారా 9 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరగలంటే 2200 క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుంది. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపడితేనే కేంద్రంలో విద్యుదుత్పత్తి ప్రారంభమవుతుంది. కానీ కాకతీయ కాలువకు నీటి అవసరం లేకుండా క్రాస్‌ రెగ్యులేటర్‌ను దించి ఎస్కేప్‌ గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని మళ్లించి ఉత్పత్తి చేపట్ట వచ్చు. అదే విధంగా ఎస్కేప్‌ గేట్ల ద్వారా గోదావరిలోకి 8 వేల క్యూసెక్కుల నీటిని వదిలి విద్యుదుత్పత్తిని ప్రారంభించారు.

లక్షల క్యూసెక్కులు గోదావరి పాలైనా..

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద పెరిగినప్పుడు లక్షల క్యూసెక్కులనీటిని గోదావరిలోకి వదిలారు. గరిష్టంగా 3.5 లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కానీ 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టలేదు. ఎస్కేప్‌ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు వదిలిన అధికారులు, కాకతీయ కాలువ ద్వారా 800 క్యూసెక్కులు వదిలిన పూర్తి స్థాయిలో లోడ్‌పెడితే 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే అవకాశం ఉండేది. కానీ నాలుగు రోజుల క్రితం గరిష్టంగా 35.7 మెగావాట్ల కరెంట్‌ ఉత్పత్తి అయింది. గోదావరిలోకి నీటిని వదిలిన సమయంలోనూ 34 మెగావాట్లు దాటలేదు. దీంతో ఈ ఏడాది విద్యుత్‌ ఉత్పత్తి లక్ష్యం చేరుకోవడం కష్టంగా కనిపిస్తుంది. మొత్తం 75 మిలియన్‌ యూనిట్లు(ఎం.యూ) లక్ష్యం కాగా ఇప్పటి వరకు 15.18 మిలియన్‌ యూనిట్ల కరెంట్‌ తయారు అయింది. గతేడాది ఈ సమయానికి 37.5 మిలియన్‌ యూనిట్లు ఉత్పత్తి చేశారు. గతేడాది లక్ష్యం 75 ఎం.యూ కాగా మొత్తంగా 139 మిలియన్‌ యూనిట్లు ఉత్పత్తి చేశారు. గతేడాది ఒక టర్బయిన్‌లో వైబ్రెషన్‌ రావడంతో ప్రస్తుతం పూర్తిస్థాయిలో లోడ్‌ పెట్టడం లేదని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండటంతో రెండు టర్బయిన్‌ల ద్వారా 12 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పల్లెల్లో గంజాయి జోరు

- గంజాయి కొనుగోళ్లకు యువకుల కోడ్‌ భాష

మోర్తాడ్‌: ఒరేయ్‌ కొట్టాలని మనసు ఉబలాట పడుతుందిరా.. మరి రైడ్‌కు వెళదామా.. ఇది గంజాయి కొనుగోళ్ల కోసం యువత పలికే కోడ్‌ భాష. కొట్టాలని ఉంది అంటే గంజాయి సేవించాలని, రైడ్‌కు వెళదామా అంటే గంజాయి విక్రేత వద్దకు వెళ్లి కొనుగోలు చేసి తీసుకరావడం అని అర్థం. గంజాయి మత్తులో జోగుతున్న పల్లెల్లో యువత తాము చేసే నిర్వాకం నలుగురికి తెలియకుండా ఉండటానికి కోడ్‌ పదాలను ఉపయోగిస్తున్నారు. ఇటీవల కొందరు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేయడం, మరికొందరు వ్యసనపరులకు కౌన్సెలింగ్‌ ఇవ్వడంతో గంజాయి కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన కోడ్‌ భాష వెలుగులోకి వచ్చింది. గంజాయికి అడ్డాలుగా మారిన మోర్తాడ్‌, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, భీమ్‌గల్‌, మెండోరా, ముప్కాల్‌, బాల్కొండ, వేల్పూర్‌ మండలాల్లో గంజాయి విక్రేతలు, మత్తుకు బానిసైన వారు ఎవరికి చిక్కకుండా ఉండటానికి కోడ్‌ భాషను అమలు చేస్తున్నారు. గంజాయిని నియంత్రించడానికి పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఫలించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి పల్లెలోను గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుండటం చూస్తే యువత ఎంతగా మత్తుకు బానిసలు అయ్యారో అర్థం అవుతుంది. ఏర్గట్ల పోలీసులు ఇటీవల తొర్తిలో కోరుట్లకు చెందిన ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేశారు. గతంలోను మెట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులను తడపాకల్‌లో అరెస్టు చేశారు. ఇక్కడ గంజాయి విచ్చలవిడిగా లభించడానికి పొరుగు జిల్లాల నుంచి యువకులు వాహనాలపై వచ్చి విక్రయించి వెళుతున్నారని స్పష్టమైతుంది.

అనారోగ్యం పాలవుతున్న యువకులు

గంజాయికి బానిసలుగా మారిన యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. నెల రోజుల కింద కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌కు చెందిన ఒక యువకుడు గంజాయికి బానిసై మంచాన పడి మరణించాడు. అతనికి మూడేళ్లలోపు వయస్సు ఉన్న ఇద్దరు చిన్నారులు, భార్య, తల్లి, తండ్రి ఉన్నారు. యువకుడు మరణించడంతో ఆ ఇంటికి పెద్దదిక్కు లేకుండా పోయింది. గంజాయి మత్తులో జోగిన సదరు యువకుడు సరైన తిండి తినకపోవడం, ఆరోగ్యాన్ని లెక్క చేయకపోవడంతో అతని శరీరంలోని అన్ని అవయవాలు చచ్చుబడిపోయి మరణానికి దారితీసిందని గ్రామస్తులు వెల్లడించారు. ఇదే హాసాకొత్తూర్‌లో గంజాయి మత్తులో ఒక యువకున్ని కొట్టి చంపారు. ఇది ఇలా ఉండగా ఇటీవల కమ్మర్‌పల్లిలోని ఒక పెట్రోల్‌ బంక్‌లో గంజాయి మత్తులో ఉన్న యువకులు సిబ్బందిపై దాడి చేసి డీజిల్‌ పోయించుకుని డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారు. యువకులు మత్తులో ఉన్న విషయం గమనించిన పెట్రోల్‌ బంక్‌ కార్మికులు మౌనం వహించాల్సి వచ్చింది. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్‌ అధికారులు స్పందించి గంజాయి మత్తులో జోగుతున్న యువకులను గుర్తించి వారికి కౌన్సెలింగ్‌ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేస్తున్నారు.

రుణమాఫీకి నోచుకోని రైతు



పెంట భాజన్న

కమ్మర్‌పల్లి: అధికారుల తప్పిదమో.. సాంకేతిక లోపమో తెలియదు కాని ఓ రైతు రుణమాఫీకి నోచుకోవడం లేదు. ఈ విషయమై రెండేళ్లుగా బ్యాంకు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టు తిరిగినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ కాలయాపన చేశారే గానీ సమస్య మాత్రం పరిష్కరించలేదు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌ గ్రామానికి చెందిన పెంట భాజన్న కమ్మర్‌పల్లిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 2018 ఆగస్టు 21న రూ.32 వేలు పంట రుణం తీసుకున్నాడు. ప్రభుత్వం ఇది వరకే రెండు విడతల్లో రుణమాఫీ చేయగా, ప్రస్తుతం మూడో విడత ప్రకటన చేసింది. మొదటి విడతలో రూ. 25 వేలు లోపు రుణాలు మాఫీ కాగా, 2021–22 లో రెండవ విడతలో రూ. 33 వేల లోపు రుణాలు మాఫీ అయ్యాయి. భాజన్న రూ. 32 వేలు రుణం కాగా, రెండో విడత మాఫీకి అర్హుడు. మాఫీ సొమ్ము కోసం స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మేనేజర్‌ను సంప్రదించాడు. రుణమాఫీ జాబితాలో పేరు లేదని సమాధానం రాగా, వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. దీంతో బాధితుడు వ్యవసాయాధికారులను కలవగా అక్కడ కూడా సరైన సమాధానం దొరకలేదు. బ్యాంకర్లదే తప్పిదమని తోసిపుచ్చారు. తమ తప్పు లేదని బ్యాంకర్లు వ్యవసాయాధికారులపైకి నెట్టేశారు. ఇలా ఒకరిపైకి ఒకరు నెట్టేసుకుంటూ కాలయాపన చేశారు. దీంతో రైతు రుణమాఫీకి దూరం అయ్యాడు.

పోలీసులకు అనుమానితుల అప్పగింత

నందిపేట్‌: మండలంలోని బాద్గుణ గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురిని పట్టుకొని గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం నలుగురు ఆడవారి వేషంలో, ఇద్దరు మగవారు కలిసి గ్రామంలో తిరుగుతుండగా అనుమానం వచ్చిన గ్రామస్తులు వారిని పిలిచి ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానం చెప్పడంతో పాటు గ్రామస్తులకు ఎదురు మాట్లాడటంతో వారిని పట్టుకొని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. వారి వద్ద వెతుకగా మత్తు పదార్థాలతో పాటు గోళీలు, కల్తీ కల్లు కనిపించాయి. దీంతో గ్రామస్తులు వారిని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

వర్నికి మహిళా డిగ్రీ కళాశాల మంజూరు



ఫంక్షన్‌ హాల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్‌ పోచారం

వర్ని: వర్నికి మహిళా డిగ్రీ కళాశాల మంజూరైనట్లు స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. వర్నిలో రూ.70 లక్షలతో నిర్మించిన జనరల్‌ ఫంక్షన్‌ హాల్‌ను మంగళవారం స్పీకర్‌ ప్రారంభించారు. ఎనిమిది కోర్సులతో డిగ్రీ కళాశాల మంజూరు అయిందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 100 జనరల్‌ ఫంక్షన్‌ హాళ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతుంటే ప్రతిపక్షాలు పనులను అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. రాబోవు ఎన్నికల్లో ప్రతిపక్షాల వారు ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని, కాంగ్రెస్‌ హయాంలో నిర్మించామని చెప్పుకుంటున్న ఇండ్లు ఎక్కడున్నాయని వాటి నిధులు ఎక్కడికి పోయాయని ప్రజలు నిలదీయాలని సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. వర్ని జెడ్పీటీసీ హరిదాసు, మార్కెట్‌ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్‌, బాలరాజు, కరీం, సొసైటీ అధ్యక్షుడు సాయిబాబా, కృష్ణారెడ్డి, సర్పంచులు రాజు, కస్నీరం వెంకన్న, కృష్ణ పాల్గొన్నారు.

వీవోఏ ఇల్లు ముట్టడించిన మహిళలు

- వంటా వార్పుతో నిరసన
- తమ డబ్బులు చెల్లించాలని డిమాండ్‌



వీవోఏ ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

నిజాంసాగర్‌: స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల కిస్తీలు చెల్లించిన డబ్బుల కోసం స్వయం సహాయక సంఘాల మహిళలు పోరుబాట పట్టారు. నిజాంసాగర్‌ మండలం హసన్‌పల్లిలో మంగళవారం మహిళలు వీవోఏ స్వప్న ఇంటిని ముట్టడించారు. గ్రామంలోని 11 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి పొదుపు డబ్బులు రూ.26 లక్షలను బీసీ పాయింట్‌ నిర్వాహకులు గోల్‌మాల్‌ చేశారు. ప్రతి నెల స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ డబ్బులు బీసీ ఆన్‌లైన్‌ సర్వీస్‌ సెంటర్‌లో చెల్లిస్తుంటారు. కానీ పొదుపు డబ్బులు మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకుండా బీసీ పాయింట్‌ నిర్వాహకులు పక్కదారి పట్టించారు. బీసీ పాయింట్‌కు చెల్లించిన కిస్తీలు, వాటి రసీదులు చేతపట్టుకొని ఐదారు నెలల కింద మహిళలు ఐకేపీ కార్యాలయాన్ని ముట్టడించారు. విషయం తెలుసుకున్న ఐకేపీ అధికారులు, స్టేట్‌ బ్యాంకు అధికారులు బీసీ పాయింట్‌ నిర్వాహకురాలిపై విచారణ చేపట్టారు. మహిళలు కలెక్టర్‌ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. కానీ స్వాహా అయిన డబ్బులు మహిళలకు చేరకపోవడంతో పలు మార్లు మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని ముట్టడించారు. దాంతో మండల నాయకులు జోక్యం చేసుకొని డబ్బులు ఇప్పించే ప్రయత్నం చేశారు. అయినా సమస్య కొలిక్కి రాకపోవడంతో మహిళలు హసన్‌పల్లి గ్రామంలోని వీవోఏ ఇంటిని ముట్టడించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు వీవోఏ ఇంటి వద్ద కూర్చోని అక్కడే వంటా వార్పు చేశారు. రాత్రి కూడా అక్కడే బస చేయనున్నట్లు తెలిపారు. తమకు డబ్బులు చెల్లించే వరకు పోరాటం చేస్తామని మహిళలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి జన్మదిన వేడుకలు



కేక్‌ కట్‌ చేస్తున్న నర్సారెడ్డి

మోపాల్‌: నగరంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ కట్‌ చేశారు. అరికెలకు కాంగ్రెస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌ బీన్‌ హందాన్‌, పీసీసీ డెలిగేట్‌ శేఖర్‌ గౌడ్‌, నాయకులు, ఆయా మండలాల అధ్యక్షులు పారుపల్లి గంగారెడ్డి, సంతోష్‌ రెడ్డి, పోలసాని శ్రీనివాస్‌, అరికెల రాజారెడ్డి, రత్నాకర్‌ గౌడ్‌, అమృతాపూర్‌ గంగాధర్‌ పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎల్లోల్ల సాయిరెడ్డి, చెలిమెల నర్సన్న, నవీన్‌ గౌడ్‌, నరేష్‌ కుమార్‌, నవీన్‌ రెడ్డి పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండలో మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. కేక్‌ కట్‌ చేసి, పండ్లు పంపిణీ చేశారు. బండారి నరేష్‌, రమేష్‌, రాజేశ్వర్‌గౌడ్‌, ఆసిఫ్‌, రాంరెడ్డి, పీరు, మోహన్‌లాల్‌ పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

మొబైల్‌ షాప్‌లో చోరీ



పెద్దకొడప్‌గల్‌: పెద్దకొడప్‌గల్‌లోని అంబేడ్కర్‌ చౌరస్తాలో ఉన్న సోను–మోను మొబైల్‌ షాపులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం తాళాలు పగులగొట్టిన దొంగలు సుమారు రూ.30 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడు వెంకట్‌గౌడ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

కూరగాయల షాపులో..

రుద్రూర్‌: రుద్రూర్‌ బస్టాండ్‌ సమీపంలో ఉన్న కూరగాయల దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితురాలు కళావతి మాట్లాడుతూ కూరగాయలు విక్రయించి కుటుంబాన్ని పోషించుకునే తమపై ఎవరో కక్ష కట్టి చోరీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇదే షాపులో రెండు సార్లు దొంగలు చొరబడి నగదు, కూరగాయలు ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం సైతం నగదు, కూరగాయలు పోయినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

జూనియర్‌ కళాశాలలో..

గాంధారి: గాంధారి ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. కళాశాలలో నుంచి కంప్యూటర్‌ను అపహరించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్‌ గడ్డం గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు

ఖలీల్‌వాడి: ఆస్పత్రులకు వచ్చిన వారి దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న మహిళను అరెస్టు చేసినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌కు చెందిన సమీస్‌ బేగం నగరంలోని ఖలీల్‌వాడిలో ఆసుపత్రులకు ఇతర గ్రామాల నుంచి వచ్చే వారి వద్ద చోరీలు చేసేది. వారి దృష్టి మరల్చి బ్యాగులో ఉన్న డబ్బులు, బంగారం ఎత్తుకెళ్లేది. మార్చి16న వైష్ణవి ఆస్పత్రిలో ఇలాగే చోరీ చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలిని పట్టుకున్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో మేనమామ శ్రీనివాస్‌ను కత్తితో పొడిచిన పోలు రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సాయికుమార్‌ మంగళవారం తెలిపారు. పోలు రాజును కామారెడ్డి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌ విధించారని చెప్పారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య



ముదాం చందు(ఫైల్‌)

కామారెడ్డి టౌన్‌: కామారెడ్డిలోని 27వ వార్డుకు చెందిన ముదాంగల్లిలో గల ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదిలో ఓ యువకుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ నరేష్‌ తెలిపారు. వివరాలు.. ముదాంగల్లికి చెందిన ముదాం చందు(33) కుటుంబ కలహాలు, అనారోగ్య కారణాలతో ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదిలో పెట్రోల్‌ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కొన్ని రోజులుగా చందు ఇంట్లో తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మృతుడి భార్య పిల్లలను తీసుకుని రెండు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన చందు పాఠశాలలోని గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాల అటెండర్‌ ఆ గది తలుపులు తీయగా పూర్తిగా కాలిపోయిన స్థితిలో మృతదేహం ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విచారణ చేసి మృతదేహం చందుదిగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..

ఎల్లారెడ్డి: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేశ్‌ మంగళవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన మైలారం సాయిలు(45) సోమవారం ఎల్లారెడ్డికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిలో వెతకగా పట్టణంలోని బాలాగౌడ్‌ ఫంక్షన్‌ హాల్‌ మృతదేహం కనిపించింది. అనారోగ్యానికి గురి కావడంతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

మోపాల్‌: మోపాల్‌లోని ఓ కోళ్లఫారంలో కూలీ పని చేస్తున్న మురీష్‌(41) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాము మంగళవారం తెలిపారు. నిర్మల్‌ జిల్లా కుంటాల మండలం లింబా(కె) గ్రామానికి చెందిన మురీష్‌ వారం క్రితం సహజీవనం చేస్తున్న లక్ష్మితో కలిసి పనిలో చేరాడు. మురీష్‌ తాగుడుకు బానిసై సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో లక్ష్మి కుటుంబ సభ్యులతో చెప్పడంతో వారు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై కోళ్లఫారంలోనే ఉరి వేసుకున్నాడు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో రావుట్లవాసులకు గాయాలు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

సిరికొండ: ఆర్టీసీ చైర్మన్‌, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలవడానికి హైదరాబాద్‌ వెళ్తుండగా మెదక్‌ జిల్లా చేగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని రావుట్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. బాజిరెడ్డికి టికెట్‌ రావడంతో గ్రామానికి చెందిన పలువురు రెండు కార్లలో మంగళవారం వేకువజామునే హైద్రాబాద్‌కు తరలివెళ్లారు. మార్గమధ్యంలో చేగుంట వద్ద పట్టణంలో నుంచి హైవే పైకి వస్తున్న కోళ్ల వ్యాను వీరు ప్రయాణిస్తున్న ఒక కారును బలంగా ఢీకొనడంతో ప్రమాదం నెలకొంది. ఆ కారులో ప్రయాణిస్తున్న తోట రాజన్న, నత్తి భూమయ్య, నడుకుడ రెడ్డి, ప్యాట్ల అశోక్‌, హరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎయిర్‌ బెలూన్లు తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను హైద్రాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే దగ్గర ఉండి క్షతగాత్రులకు చికిత్స చేయించారు. తాను అన్ని విధాలా అండగా ఉంటానని వారికి ధైర్యం చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌ నిమ్మగడ్డ సత్యనారాయణతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని, ఖర్చులు తానే భరిస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

బైక్‌పై నుంచి పడి ఒకరు..

పిట్లం: పిట్లంలోని రాజస్థాన్‌ దాబా సమీపంలో మంగళవారం జాతీయ రహదారి పక్కన వడ్ల విజయ్‌ బైక్‌ అదుపు తప్పి పడిపోయాడు. నిజాంసాగర్‌ మండలం నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామానికి చెందిన విజయ్‌ బైక్‌పై పిట్లం నుంచి నర్సింగ్‌రావ్‌పల్లి వెళ్తుండగా బైక్‌ అదుపు తప్పి కింద పడిపోయాడు. రోడ్డు పక్కన గుంతల్లో పడడంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు హైవే సిబ్బందికు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



కిషన్‌ (ఫైల్‌)

సదాశివనగర్‌: సదాశివనగర్‌ శివారులో 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. వివరాలు.. మద్నూర్‌ మండలం పెద్దశక్కర్గ గ్రామానికి చెందిన చిక్కల్వార్‌ కిషన్‌(57) కొన్ని రోజులుగా సదాశివనగర్‌ శివారు మల్లుపేట్‌ బ్రిడ్జి వద్ద గల తాజ్‌ హోటల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి సదాశివనగర్‌ నుంచి దాబాకు రోడ్డు వెంబడి నడుచుకుంటు వస్తుండగా నిజామాబాద్‌ వైపు వెళ్లే వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహంపై నుంచి ఇతర వాహనాలు వెళ్లడంతో ముక్కలయింది. గుర్తించడానికి ఆనవాళ్లు లేకుండా పోయింది. మృతుడు ధరించిన చెప్పుల ఆధారంగా దాబాలో పని చేసే వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.